పత్తితీతకు కూలీల కొరత..

- చేలల్లోనే కారిపోతున్న పత్తి
- ఇబ్బందులు పడుతున్న రైతులు


సుజాతనగర్‌లో చేనులోనే కారిపోతున్న పత్తి

సుజాతనగర్: మండలంలోని గ్రామాల్లో పత్తిసాగు చేసిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది వ్యవసాయ సాగు ప్రారంభంలో వర్షాభావ పరిస్థితులతో నష్టపోయిన రైతన్నలు ఇప్పుడు పత్తి తీసేందుకు కూలీలు దొరక్క తిప్పలు పడుతున్నారు. దీంతో రోజులుగా చేలల్లోనే పత్తి కారిపోతున్న పరిస్థితి నెలకొంది.

11,303 ఎకరాల్లో...

మండలంలో ప్రధానంగా సర్వారం, బేతంపూడి, నిమ్మలగూడెం, సీతంపేట బంజర, సీతంపేట, రాఘవాపురం, నాయకులగూడెం, కోయగూడెం తదితర గ్రామ పంచాయతీల పరిధిలో 11,303 ఎకరాల్లో రైతులు ఈ ఏడాది పత్తి పంటను సాగు చేశారు. ఎకరానికి 10 క్వింటాళ్ల చొప్పున 1.13 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. పంట సాగు కోసం రైతులు పలు రకాల కంపెనీల పత్తి విత్తనాలను కొనుగోలు చేశారు. సాగైన పత్తి పంటకు దుక్కులు దున్నిన నాటి నుంచి ఎరువులు, పురుగుల మందులు, కూలీలకు కలిపి ఎకరాకు సుమారు రూ.25 వేల పెట్టుబడులు పెట్టగా, మొత్తం రూ.లక్ష వరకు రైతులకు ఖర్చు అయినట్లు రైతులు చెబుతున్నారు. మొదట్లో పత్తి సాగు బాగానే కనిపించినప్పటికీ ఆ తర్వాత పూత, కాతకు వచ్చే దశలో అకాల వర్షాలతో పాటు వాతవరణ పరిస్థితుల మూలంగా తెగుళ్ల ఆశించాయి.

కూలీల కొరత..

మండలంలో అత్యధిక రైతులు బీటీ విత్తనాలను విత్తారు. మండల వ్యాప్తంగా పత్తి పంట ఎక్కువ విస్తీర్ణంలో సాగు అవడంతో పత్తి తీసేందుకు కూలీలు లభించక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రస్తుతం ఎటు చూసినా పొలాలన్నీ పగిలిన పత్తితో తెల్లగా మెరుస్తూ కనిపిస్తున్నాయి.

పెరిగిన డిమాండ్...

కూలీల కొరత కారణంగా కిలో పత్తితీతకు రూ.12 నుంచి రూ.14 వరకు చెల్లిస్తున్నా కూలీలు దొరకని పరిస్థితి నెలకొంది. కూలీలు దొరక్కపోవడంతో రైతులు తెల్లవారకముందే కూలీల ఇళ్ల ముందు వాలుతున్నారు. తలుపు తట్టి లేపి మరీ బేరమాడుతున్నారు. కూలీలు దొరకడం లేదని అనేక మంది రైతులు వారివారి కుటుంబ సభ్యులతో రోజుల తరబడి పత్తి ఏరుతున్నారు. రూ.వేల పెట్టుబడి పెట్టి సాగుచేసిన పత్తి పంట చేతికొచ్చే సమయంలో రైతులు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. మండలంలోని కొన్ని ప్రాంతాలకు చెందిన రైతులు మహారాష్ట్ర నుంచి కూలీలను తీసుకొస్తున్నారు. చేలో పత్తి ఏరడం పూర్తయ్యే వరకు కూలీలకు కావాల్సిన అన్ని వసతులను రైతులే సమకూర్చుతున్నారు. పత్తి తీయడం ముగిశాక వారిని సొంత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

ఒక్క ఏరివేతకే..

ఈసారి గతంలో ఎన్నడూ లేని విధంగా పత్తి పంట దిగుబడి తగ్గిపోయింది. వర్షాభావ పరిస్థితులు, తుఫాను ప్రభావంతో పత్తి పంటలో కాయలు కాయలేదు. కాసిన కాయలు కూడా ఒకేసారి పగలడంతో ఒక్క ఏరివేతకే చేనులో పత్తి ఖాళీ అవుతోంది. ఎన్నడూ లేని విధంగా పత్తిని తీసేందుకుకు ఒక్కో కూలీకి అధికంగా చెల్లించాల్సి వస్తోంది. ఉన్న పంటకైనా మార్కెట్లో ధర వస్తుందనుకుంటే నాణ్యత లేదనే సాకుతో క్వింటా పత్తిని రూ.6,500 మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. వచ్చిన పైసలు కూలీలకే సరిపోతున్నాయని, పంట సాగు కోసం తెచ్చిన పెట్టుబడి డబ్బులు ఎక్కడి నుంచి తేవాలో అర్థం కావడం లేదని రైతు వాపోతున్నారు. రెండో పంట కూడా వేసుకునే పరిస్థితి కన్పించడం లేదని, పత్తి సాగు వల్ల తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడి తగ్గింది..



ఐదు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాను. రూ.2 లక్షల పెట్టుబడి అయింది. ఎకరానికి 8 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. నాణ్యత లేదనే సాకుతో మార్కెట్‌లో తక్కువ ధరకు కొంటున్నారు. పత్తిని తొలగించి వేరుశనగ సాగు చేస్తున్నాను.

– గుగులోత్ నాగేష్, మర్రితండా

ప్రభుత్వం ఆదుకోవాలి..



ఈసారి వర్షాల వల్ల పత్తి పంట రంగు మారింది. దిగుబడి కూడా చాలా తగ్గింది. మార్కెట్‌లో ధర లేకపోవడం, దిగుబడి తగ్గడంతో ఈ ఏడాది చాలా నష్టపోవాల్సి వచ్చింది. ఉన్న కొద్దిపాటి పత్తిని ఏరదామంటే కూలీలు దొరకడం లేదు.

– గుగులోత్ శంకర్, మర్రితండా

కార్మికులను ఆదుకోవాలి


మాట్లాడుతున్న గోపాల్‌రావు

జూలూరుపాడు: ఆటో, మోటార్ కార్మికులను ఆదుకోవాలని టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి వై.గోపాల్‌రావు, తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో, మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు రాయల సిద్ధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జూలూరుపాడులో జరిగిన ఆటో కార్మికుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. స్వయం ఉపాధి రంగమైన ఆటో, మోటార్ రంగాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని ఆటో, మోటార్ కార్మికుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం మహిళలకు వరంగా మారగా.. ఆటో, మోటార్, క్యాబ్ కార్మికులకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఆటో కార్మికులకు ఏడాదికి రూ.12,000 ఇస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు దిబ్బెందుల నరేష్, కత్తి సాయి, కె.చందు, నేలాల అశోక్, రంజిత్ పాల్గొన్నారు.

కొత్త పంచాయతీలను ఏర్పాటు చేయండి..

టేకులపల్లి: టేకులపల్లి మండలంలో ప్రస్తుతం 36 పంచాయతీలు ఉన్నాయి. మొదట్లో టేకులపల్లి మండలంలో 12 పంచాయతీలు ఉండగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో వాటిని విభజించి 24 నూతన పంచాయతీలను ఏర్పాటు చేయడంతో 36 జీపీలు అయ్యాయి. అయితే వీటిలో నుంచి మరికొన్ని కొత్త పంచాయతీలను ఏర్పాటు చేయాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు లేఖ అందజేశారు. బద్దుతండా జీపీ నుంచి తుమ్మలచెలక (తుమ్మలచెలక, తుమ్మలచెలక స్టేజీ, సామ్యా తండా, కొత్తగుంపు)ని నూతన పంచాయతీలు చేయాలని, దీంతో పాటు తొమ్మిదోమైలు తండా పంచాయతీ కోటల్ల గ్రామాన్ని బేతంపూడి పంచాయతీలో కలపాలని, బేతంపూడి పంచాయతీలో ఉన్న బేతంపూడి స్టేజీ, వెంకట్యాతండా గ్రామాలను తొమ్మిదోమైలు తండా పంచాయతీలో కలపాలని కలెక్టర్‌ని కోరినట్లు ఎమ్మెల్యే ఆదివారం తెలిపారు.

చక్ర సిద్ధ్ వైద్యశిబిరానికి స్పందన

జూలూరుపాడు: హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ సత్య సింధుజ స్కాలర్ నేతృత్వంలో గుండెపుడిలో ఆదివారం నిర్వహించిన ఉచిత చక్ర సిద్ధ్ వైద్య శిబిరానికి స్పందన లభించింది. జేకే ఆర్ట్స్ నిర్వాహకులు యమునా కిషోర్, కాళ్లూరు జగదీష్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత చక్ర సిద్ధ్ వైద్య శిబిరాన్ని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామీణ ప్రజలకు ప్రాచీనకాలం నాటి చక్ర సిద్ధ్ వైద్యవిధానాన్ని అందించాలనే లక్ష్యంతో డాక్టర్ సత్య సింధుజ స్కాలర్ వైద్యశిబిరం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. డాక్టర్ సత్య సింధుజ స్కాలర్ మాట్లాడుతూ... చక్ర సిద్ధ్ వైద్యం పురాతన వైద్యమని, దీనితో దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స అందించడం జరుగుతుందని అన్నారు. నాడీ వైద్యం, మృదువుగా తాకడం నేరుగా ఒత్తిడి చేసి శరీరంలోని నాడులను చైతన్యం చేయడం జరుగుతుందన్నారు. మందులు, శస్త్ర చికిత్స లేకుండా చక్రసిద్ధ్ వైద్యం అందించనున్నట్లు చెప్పారు. మైగ్రేన్, భుజం నొప్పి, నడుం నొప్పి, సయాటిక్, స్పైనల్, బ్యాక్ పెయిన్, రుమటాయిడ్ ఆర్థరైటిస్ వంటి దీర్ఘకాలిక రోగాలను నయం చేయవచ్చన్నారు. మర్మ చికిత్సతో శరీరంలో నిర్దిష్ట బిందువులను సమతుల్యం చేసి ఆరోగ్యాన్ని ప్రోత్సహించ వచ్చన్నారు. యోగా, మొబిలిటీ, వ్యాయామాలతో కదిలికలను మెరుగు పరిచి నొప్పిని తగ్గించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో లేళ్ల వెంకటరెడ్డి, కాళ్లూరు వెంకటేశ్వరరావు, కొమ్మినేని పాండురంగారావు, మాలోత్ మంగీలాల్ నాయక్, కొమ్మినేని కృష్ణమూర్తి, దుద్దుకూరి సుమంత్, జవ్వాజి వీరరాఘవులు, కొలిపాక వెంకటేశ్వర్లు, సున్నా కృష్ణయ్య, బానోత్ ధర్మా, ఎస్సై బి.రవి, నిర్వాహకులు కిషోర్, జగదీష్‌కుమార్ పాల్గొన్నారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం


కేక్ కట్ చేస్తున్న వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

జూలూరుపాడు: ఏసుక్రీస్తు చూపిన శాంతి మార్గం అందరికీ అనుసరణీయమని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. ఆదివారం జూలూరుపాడు ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో తహసీల్దార్ కె.స్వాతిబిందు పర్యవేక్షణలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకలకు వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కేక్ కట్ చేసి, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. మాట్లాడుతూ.. సర్వమత సమానత్వమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. నిరుపేద క్రైస్తవులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, అదేవిధంగా పాస్టర్లకు సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను పాస్టర్లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లేళ్ల వెంకటరెడ్డి, తహసీల్దార్ కె.స్వాతిబిందు, ఎస్సై బి.రవి, మాలోత్ మంగీలాల్ నాయక్, దుద్దుకూరి మధుసూదన్‌రావు, బానోత్ లాలు నాయక్, రోకటి సురేష్, రాంశెట్టి రాంబాబు, కొలిపాక వెంకటేశ్వర్లు, బానోత్ ధర్మా, గుగులోత్ రాంబాబు దంపతులు, చలమల నరసింహారావు, పాస్టర్లు కబీర్ దాసు, సుభాకర్, నతానేయులు, వి.ఎలీషా, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆటో అండ్ మోటార్ వర్కర్ల సంఘం ఎన్నిక


వెంకన్న, ప్రవీణ్

ఇల్లెందు: తెలంగాణ రాష్ట్ర ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులుగా యు.ప్రవీణ్, పి.వెంకన్న ఎన్నికయ్యారు. టీయూసీఐకి అనుబంధంగా హైదరాబాద్‌లో జరిగిన మహాసభలో ఇల్లెందుకు చెందిన పాయం వెంకన్న రెండోసారి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యాడని టీయూసీఐ జిల్లా కార్యదర్శి యాకుబ్‌షావలీ తెలిపారు. 21 మందితో నూతన కమిటీని ఎంపిక చేశారు.

ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న నాయకులు

జూలూరుపాడు: అనంతారం గ్రామానికి చెందిన పూనెం ప్రేమలత ఇటీవల కిడ్నీ వ్యాధితో మృతి చెందింది. ఆమె కుటుంబసభ్యులను అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కొర్సా రమేష్, నందిని దంపతులు పరామర్శించి, రూ.5,000 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఉసికల వెంకటేశ్వర్లు, బండారు పుల్లారావు, మల్కం వీరభద్రం పాల్గొన్నారు.

బియ్యం వితరణ

జూలూరుపాడు: పాపకొల్లు గ్రామ పంచాయతీ బచ్చలకోయగూడెం గ్రామానికి చెందిన బత్తుల రాజేష్ ఇటీవల మృతి చెందాడు. ఆదివారం బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యం, నగదు అందజేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బానోత్ నవీన్ రాథోడ్, ధర్మరాజుల వెంకటనారాయణ, భూక్యా అమ్ము నాయక్, నిమ్మటూరి ముత్తయ్య, ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి గుగులోత్ శ్రీనివాసరావు, ధర్మరాజుల సత్యనారాయణ, నునావత్ మోహన్, అక్కుల నాగరాజు, నిమ్మటూరి కనకయ్య, మడి రవి, మద్దిశెట్టి వంశీ పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమర యోధుడు మృతి


అలీం (ఫైల్)

ఇల్లెందు: సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి, స్వాతంత్య్ర సమరయోధుడు ఇందిరానగర్‌కు చెందిన అబ్దుల్ అలీం (106) ఆదివారం మృతి చెందారు. ఆయన మృతదేహం వద్ద పలువురు పట్టణ ప్రముఖులు నివాళులర్పించారు.

క్లుప్తంగా

బస్టాండ్‌లో స్వచ్ఛ భారత్


మొక్క నాటుతున్న డీఎస్పీ రెహమాన్

చుంచుపల్లి: కొత్తగూడెం బస్టాండ్ ప్రాంగణంలో అసెస్ వావ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలను శుభ్రం చేసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి హాజరైన కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ... సమాజసేవలో అసెస్ వావ్ చేస్తున్న సేవలను కొనియాడారు. పర్యావరణ పరిరక్షణకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డీఎం దేవేందర్ గౌడ్, వైఎస్ రావు, సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.

మైనారిటీ నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ పరిధిలోని తెలంగాణ మైనారిటీ స్టడీ సర్కిల్ వారు అందిస్తున్న ఫౌండేషన్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని గ్రూప్ 1, 2, 3, 4 రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, బ్యాంకు ఉద్యోగ పరీక్షలకు హాజరు కానున్న మైనారిటీ వర్గాల కోసం నాలుగు నెలల పాటు శిక్షణ అందించటం జరుగుతుందని పేర్కొన్నారు. శిక్షణ పొందేందుకు అభ్యర్థులు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్ల జిరాక్స్, ఆధార్ కార్డులతో జనవరి 15 లోపు హైదరాబాద్‌లోని మైనారిటీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని మైనారిటీ వర్గాలకు చెందిన ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీలు, సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఏజెన్సీకి బస్సు సౌకర్యం కల్పించండి..


ధర్నా చేస్తున్న దృశ్యం

ఇల్లెందురూరల్: ఏజెన్సీ పల్లెలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని లక్ష్మీనారాయణ తండా గ్రామంలో ఆదివారం మాస్‌లైన్ ఆధ్వర్యంలో స్థానికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాస్‌లైన్ నేత బుర్ర రాఘవులు, పీవైఎల్ మండల అధ్యక్షుడు ఇస్లావత్ కోటేష్ మాట్లాడుతూ.. మండల కేంద్రంగా ఆర్టీసీ బస్సు డిపో ఏర్పాటు చేసి ఏడాది గడిచినా నేటికీ మారుమూల పల్లెకలకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని వాపోయారు. రహదారులు అధ్వానంగా ఉన్న సమయంలో బస్సులు నడిపిన ఆర్టీసీ అధికారులు నేడు ప్రతీ పల్లెకు బీటీ రోడ్డు సౌకర్యం ఉన్నా బస్సులు నడపడంలో మీనామేషాలు లెక్కించడం సరికాదన్నారు. ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యంపై ఈనెల 24న బస్సు డిపో ఎదుట నిర్వహించే ధర్నాకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బాలాజీ, రవి, నవీన్, భాస్కర్, కమల, లక్ష్మి, గంగి, నేజీ పాల్గొన్నారు.

వెంకటస్వామికి నివాళి


నివాళులర్పిస్తున్న జీఎం కృష్ణయ్య

ఇల్లెందు: సింగరేణి కార్మికశాఖ మంత్రిగా, సింగరేణిలో అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలు అమలు చేసిన ఘనత పెద్దపల్లి ఎమ్మెల్యే, ఎంపీగా పనిచేసిన దివంగత గడ్డం వెంకటస్వామికి దక్కిందని ఏరియా జీఎం వీసం కృష్ణయ్య అన్నారు. ఆదివారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. కార్మిక సంఘం నేతగా కేంద్రమంత్రిగా విభిన్న తరహాలో పేదల కోసం నిరంతరం పాటుపడిన వెంకటస్వామి సేవలు మరువలేనివన్నారు. ఎస్ఓటూ జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, అధికారులు గిరిధర్ రావు, జీవీ మోహన్‌రావు, నరిసింహారాజు, రవికుమార్, ధనుంజరెడ్డి పాల్గొన్నారు.

జీఎం కృష్ణయ్యకు సత్కారం

ఇల్లెందు: సింగరేణి నూతన ఏరియా జీఎం వీసం కృష్ణయ్యను ఆదివారం జేకే బ్లాక్ డైమండ్ స్టేడియం వాకర్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆదివారం ఇల్లెందులోని ఏరియా జీఎం కార్యాలయం చాంబర్‌లో శాలువ, పూలమాలతో సత్కరించారు. ఓపెన్ జిమ్ మంజూరు చేయాలని, మరుగుదొడ్ల పూర్తి చేయాలని, స్టేడియాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా చేయాలని, కోతుల బెడద నుంచి పిల్లలను రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు దంతాల ఆనంద్, విశ్వనాథం, అప్పలరాజు, శ్రీనివాస రెడ్డి, సురేంద్రబాబు తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలపై సీపీఐ స్పందిస్తుంది


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందిస్తూ వాటి పరిష్కారానికి శ్రమిస్తున్న సీపీఐకి ప్రజాదరణ పెరుగుతోందని కొత్తగూడెం ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర సీపీఐ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం కొత్తగూడెం ఏరియా 2, 3, 4 వార్డులకు చెందిన 60 కుటుంబాల వారు విద్యానగర్ కాలనీలో జరిగిన కార్యక్రమంలో కూనంనేని సమక్షంలో సీపీఐలో చేరారు. వీరికి ఎర్ర కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ... ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నియోజకవర్గంలోని ప్రతీ గ్రామాన్ని, బస్తీలను అభివృద్ధి చేస్తున్నామని ప్రజలకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నట్లు చెప్పారు. నూతనంగా పార్టీలో చేరుతున్న నాయకులు ప్రజాక్షేత్రంలో పనిచేయాలని ప్రజలతో మమేకమైతేనే పార్టీకి మరింత ఆదరణ పెరుగుతుందన్నారు. భవానీ, నాగేంద్ర, మందా గణేష్, నరేష్‌ల నేతృత్వంలో 60 కుటుంబాలు వారు సీపీఐలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే సాబీర్‌పాషా, దుర్గరాశి వెంకటేశ్వర్లు, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, కిలారు ప్రసాద్, కొండ స్వామి, యాంర్రమహేష్, మధు పాల్గొన్నారు.

ఏరియా ఉత్తమ కార్మికులు వీరే..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం ఏరియాలో విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన అధికారులను, ఉత్తమ కార్మికులను ఎంపిక చేసింది. వారిలో అలుగోలు ప్రదీప్‌కుమార్, (ఇంజనీర్ జేవీఆర్ సీహెచ్‌పీ), సీహెచ్ దుర్గాప్రసాద్‌రెడ్డి (ఎస్ఈ) జేవీ ఆర్‌ఓసీ, ఉత్తమ కార్మికులు 1.అసిలేటి చెన్నకేశవరావు, ఫోర్‌మెన్ ఇన్‌చార్జ్ జేవీఆర్ ఓసీ, దొడ్డెపల్లి రమేష్ శ్లాపింగ్ మజ్దూర్ (జేవీఆర్ సీహెచ్‌పీ). వీరిని ఈనెల 23న కొత్తగూడెం ఏరియాలోని ప్రగతివనంలో జరగనున్న వేడుకల్లో ఏరియా జీఎం ఎం.శాలేంరాజు చేతుల మీదుగా సన్మానించనున్నారు.

ఇల్లెందు: సింగరేణి దినోత్సవం సందర్భంగా ప్రతిభ కనపర్చిన ఉద్యోగులను సంస్థ ప్రకటించింది. ఆదివారం ఇల్లెందు ఏరియాలో వివిధ డిపార్ట్‌మెంట్‌లలో పని చేస్తున్న పలువురు ఉద్యోగులను ఉత్తమ ఉద్యోగులుగా గుర్తించారు. సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సాయి స్వరూప్, జేకే ఓసీ నుంచి డిప్యూటీ మేనేజర్ వి.కిషన్, ఫిట్టర్ సత్యరాజు, కేఓసీ నుంచి జనరల్ మజ్దూర్ కనకరాజు, ఉత్తమ గృహాలంకరణ విజేతగా అంజిరెడ్డి, కరుణ శంకర్, సల్మాన్ విజయరాజ్, శ్రీనివాసరెడ్డి, వెల్ బేబీ షో విజేతలు బేబీ కింగ్ ఎల్.అమన్ సాయి, బేబీ క్వీన్ యాన్ సామాన్య, సురేష్, ప్రిన్స్ -1 డి.సుశాంక్, ప్రిన్స్-2 కే.శ్రీయన్స్, ప్రిన్సెస్ -1 పి.నందిశ ఆర్య, ప్రిన్సెస్ -2 కె.మన్వితలను ఎంపిక చేశారు.

మల్టీపర్పస్ విధానం రద్దుకు పోరాడుదాం..


జెండా ఎగురవేస్తున్న వెంకన్న

టేకులపల్లి: గ్రామ పంచాయతీల్లో మల్టీ పర్పస్ విధానం రద్దు కోసం పోరాటాలు ఉధృతం చేయాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జటంగి వెంకన్న, ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి, జిల్లా అధ్యక్షుడు తోడేటి నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు గౌనీ నాగేశ్వరరావు, దుబాకుల ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం టేకులపల్లి మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఈసం మహేష్ అధ్యక్షతన యూనియన్ జనరల్ బాడీ సభ జరిగింది. తొలుత సంఘం జెండాను ఇఫ్టూ నాయకుడు మూడు బిచ్చు ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రామ పంచాయతీ వర్కర్లను మల్టీపర్పస్ విధానంతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారని, పనికి తగిన వేతనం ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. కేటగిరీల వారీగా పనిని కేటాయించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా గ్రామపంచాయతీ కార్మికులను పర్మనెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నారాటి వెంకటేశ్వర్లు, మోతుకూరి మల్లికార్జున్, చారి, అశోక్, ఎర్రయ్య, సురేష్, జినక ప్రసాద్, తావుర్యా, భూక్యా లింగ, లక్ష్మయ్య, బాబు, ఈసం సంపత్, సరికొండ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేట్'లో రిజర్వేషన్లు అమలు చేయాలి


మాట్లాడుతున్న సురేష్ నాయక్

పాల్వంచరూరల్: ప్రైవేట్ రంగ సంస్థల్లో గిరిజనులకు రిజర్వేషన్లు అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్ డిమాండ్ చేశారు. మండలంలోని రంగాపురం గ్రామంలో ఆదివారం సేవాలాల్ సేన మండల కమిటీ సమావేశం మండల అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉద్యోగాల నుంచి గిరిజనులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దూరం చేస్తున్నాయన్నారు. ప్రైవేటీకరణ పెరగడంతో ప్రభుత్వ ఉద్యోగాలలో భారీగా కోతలు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు రాజ్యాంగం కల్పించిన హక్కులను పకడ్బందీగా అమలు చేయాలని, గిరిజన జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాగరాజు, కిషన్ నాయక్, రాములు నాయక్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ పర్యవేక్షణ


శిలాఫలకం ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏజీఎం రామకృష్ణ

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని రామవరంలో కమ్యూనిటీ హాల్‌ను సుమారు 23 లక్షలతో రినోవేషన్ చేయించారు. ఈ కమ్యూనిటీ హాల్‌ను సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ చేతుల మీదుగా ఈనెల 23న ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మేరకు ఆదివారం ఏరియా జీఎం శాలేంరాజు ఆదేశాల మేరకు ఏరియా ఏజీఎం (సివిల్) రామకృష్ణ పనులను పర్యవేక్షించారు. ఈ ప్రారంభానికి సంబంధించిన శిలాఫలకాన్ని ఎస్ఈ రాజారాంతో చర్చించి ఏర్పాటు చేశారు. సింగరేణి సీఎండీ తొలిసారిగా రామవరం వస్తున్న నేపథ్యంలో కమ్యూనిటీ హాల్‌లో అవసరమైన సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు. 2015 ఏరియా కార్మికుల శుభాకార్యాల సౌకర్యార్థం ఈ కమ్యూనిటీ హాల్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం



పాల్వంచరూరల్: రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం


ఇల్లెందురూరల్: బహుమతులు అందజేస్తున్న కరస్పాండెంట్ ప్రసాద్

పాల్వంచరూరల్: గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ 137వ జయంతి సందర్భంగా ఆదివారం లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పద్మ... రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు ఆన్‌లైన్ క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మాట్లాడుతూ... 2012లో అప్పటి భారత ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ రామానుజన్ 125వ జయంతి రోజున జాతీయ గణిత దినోత్సవంగా ప్రకటించడం జరిగిందన్నారు. అప్పటి నుంచి రామానుజన్ జయంతిని గణిత దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.శ్రీనివాసరావు, అధ్యాపకులు శ్రీనివాస్, కె.రాంబాబు, దివ్య, వేణు, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాసరామానుజన్ జయంతి, జాతీయ గణిత దినోత్సవాన్ని చల్లసముద్రం గ్రామపంచాయతీ క్యాంపు సెంటర్‌లోని విశ్వశాంతి ఉన్నత పాఠశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు గణితంలో ట్యాలెంట్ టెస్ట్ నిర్వహించారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ తుమ్మలపల్లి ప్రసాద్, ప్రిన్సిపాల్ తుమ్మలపల్లి రమాదేవి, ఉపాధ్యాయులు వీరన్న, రామారావు, సురేష్, సంతోష్, ఫర్జానా తదితరులు పాల్గొన్నారు.